# బాలబాంధవి



రచయిత :
కె. వి. ఉమామహేశ్వరశర్మ

మనవఁడు :

కథచెప్పవూ అమ్మమ్మా ?

అమ్మమ్మ :

అలాగేరా నాయనా ! ఏంకథ చెప్పమన్నావ్ ?

మనవఁడు :

నీ కేకథలొచ్చో నాకేం తెలుసు! ఏదో కథ, వేగంచెప్పు...

అమ్మమ్మ :

(కథ మొదలెట్టింది)

అనగా, అనగా ఓ గొప్ప అరణ్యంలో ముగ్గురు అనాథ బాలికలున్నారు.

మనవఁడు :

అనాథలంటే ఏంటే ?

అమ్మమ్మ :

అదుగో ! మొదలెట్టేసరికేదో ప్రశ్న వేస్తావు. అనాథలంటే దిక్కులేని వాళ్ళన్నమాట ! పాపం ! వాళ్ళకీ తల్లీ తండ్రీ చనిపోయేరు. వాళ్ళ మావఁ వాళ్ళని పెంచుతుండేవాడు. అతగాడు రోజూ పొలం దున్ని, వాళ్ళని పోషిస్తూవుండేవాడు. కాని వాళ్ళని నానాబాధలు పెట్టి చాకిరీ అంతా చేయించేవాడు.

అలా గడిచిపోతూండేవి వాళ్ళ రోజులు- పాపం !

ఓ రోజున—ఆకాశాన్ని పేదరాసి పెద్దమ్మ కుంకం ఎండపోసిందటా వే నువ్వు- అలాంటప్పుడు వాళ్ళ వాకిట్లో ఓ తెల్లని పక్షి వచ్చి వాలింది, ఆపిల్లలు ముగ్గురూ పక్షి దగ్గరకుపోయి దాన్ని ఇంటికిరమ్మని సంజ్ఞ చేశారు. అలాగే అంది పక్షి.

మనవఁడు :

అమ్మమ్మా ! పక్షన్నావుగాని అది ఏంపక్షో చెప్పేవు కావు.

అమ్మమ్మ:

ఏదో పక్షి, తెల్లని పక్షి. నాకంతబాగా జ్ఞాపకంలేదు- ముసలిముండని ! ఇహ- విను- దాన్ని తీసుకెళ్ళి ఓపాతపంజరంలో పెట్టి ధాన్యంగింజలూ పళ్ళూ పెడ్తూ ఉండేవారు పాపం! వాళ్ళకి ఆపక్షితోనే కాలక్షేపం అయేది. ఆ పక్షి పెరిగి పెద్దదయింది-

ఇల్లా ఉండగా ఓరోజున తన్ను బోనులోనుంచి విడిచిపెట్టమని ఆ పక్షి కోరిందా ముగ్గురు పిల్లల్ని.

మనవఁడు :

అయితే పక్షులు మాట్లాడతాయీ? అమ్మమ్మా !

అమ్మమ్మ:

చెబుతాగా ! కథకి కాళ్ళు, చేతులు ఉంటాయిట్రా బాబూ!

పాపం ఆపిల్లలకి ఎంతో విచారంవేసింది దాన్ని వదిలి పెట్టడానికి కొసకి వాళ్ళ ప్రాణాలు బిగపట్టి ఆపక్షిని వదలేసేరు.

ప్రతీ రోజూ రెండుకుండలు గుమ్మందగ్గ రుంచుతే దాన్నిండా ఆహారం తెచ్చిపెడతానని చెప్పి పక్షి ఎగిరిపోయింది.

మనవఁడు :

అయితే! వాళ్ళ మావఁకీ సంగతేం తెలీదూ ?

అమ్మమ్మ :

వినరా- వినుగెత్తించక! తినబోతూ రుచి అడగడం ఎందుకు ?

అలా ఆపక్షి రెండు కుండలతో

# కంచికిపోయిన కథలు ౧:

కూరలు పచ్చళ్లు, మాంసం తెచ్చి ఇస్తూ ఉండేది...

చిన్నమనవరాలు :

మరి ఇద్దెనులో !

మనవఁడు :

అయితే, నేను చెంబే ఎత్త లేనుకదా అది రెండుకుండలు ఎలా మోస్తోందే!

అమ్మమ్మ:

దానికుపాయం లేదనుకున్నావా ఏమిటి? ఆపిల్లలు కావడిలో కుండలు పెట్టి ఉంచుతే, అది ముక్కుతో తీసుకెళ్ళి ఆహారం తెచ్చి ఇచ్చేది. అదికాకుండా, అదేదో దేవత అనికూడా చెప్పుకుంటూ ఉండేవారు.

[అప్పుడే, గం 9-30 లు అయింది. పెద్దమనవఁడు సినీమాకెళ్లి వచ్చేడు.]

అమ్మమ్మ :

అన్నయ్యకి అన్నం పెట్టేసివచ్చి చెబుతాలే, చిట్టీ!

మనవఁడు :

చెప్పక పోయేవు సుమా !

[పెద్దవాడి భోజనం అయింది. వచ్చి కూర్చున్నాడు. అమ్మమ్మ కథ ప్రారంభించింది]

అమ్మమ్మ :

అల్లా[illegible]ండేసరికల్లా వాళ్ళ మావఁకీ సంగతి తెలిసింది. ఓర్వ లేక పోయేడు.

ఓనాడు ఆపక్షివచ్చే వేళకి కాచి దాన్ని చంపేసేడు.

మనవఁడు :

ఆఁ...! చచ్చిపోయిందీ? పాపం! దుర్మార్గపువెధవ! చంపేసేడు.

నేనుంటే మన దండాసాడిచేత తన్నించి ఉండేవాణ్ణి.

అమ్మమ్మ :

దాని మాంసం తినేసి దాని ఎముకలు దూరంగా పారేసేడు..

[పదిగంటలు కొట్టింది గడియారం. పాన్పుమీది కొరిగేడు పెద్దబ్బాయి. నిద్దరపట్టదు. ముసలిదానిమాటలు చెవిని పడుతున్నై. విసుగుకున్నాడు.

పెద్దమనవఁడు :

అమ్మమ్మా! నీకథలో 'జెంపో' లేదు.

అమ్మమ్మ :

అదేమిట్రా నీ కిందాక అన్నంలో వేసిన జెంకాయి పచ్చడి బావు లేదూ ?

మనవఁడు :

(నవ్వుకొని ఊరుకున్నాడు)

అమమ్మ :

(కథ కంటిన్యూచేసింది మళ్లా)

ఆ పారేసిన దుమ్ముల్ని ఆ పిల్లలు తెచ్చుకొని పెరట్లో పాతేరు. అక్కడ కొన్నాళ్ళకి పెద్దచెట్టు లేచింది. దాని నిండా వింత వింత పువ్వులు, కాయలు, పళ్లు కాచేయి. పువ్వుల్లో ముత్యాలుండేవి. అదీ ఆశ్చర్యమైన సంగతి !

మనవరాలు :

మన కొచెట్టుంటే బాగుండును సుమా !

ఈ సంగతంతా చూసి వాళ్ళ మావఁ ఓర్వలేక వాళ్ళని చెట్టు దగ్గరికే పోనిచ్చేవాడు కాడు.

ఈ సంగతి ఆవూరి రాజుకి తెలిసి ఆ ముగ్గురి పిల్లల్ని కాపాడ్డానికి నాలాంటి ముసలమ్మని సప్లై చేసేడు.

మనవఁడు :

అయితే అమ్మమ్మా! రాజు తెలివి తక్కువవాడు గాని, అలాంటి చెట్టుదగ్గర ఓభవనం కట్టించుకొని ఆముగ్గుర్ని పెళ్ళాడి అందులో ఉండలేక పోయేడూ ?

అమ్మమ్మ :

బాగా చెప్పేవురా బాబూ ! నీవ్వే ఆరాజుకి మంత్రిగా ఉంటే ఇలాంటి సలహా ఇచ్చి వుందువు, మరి పడుకోండి——

కథ కంచికి.

మీరు మంచం మీదకి.

ఆంధ్రభూమి

సచిత్రాంధ్ర మాసపత్రిక

చందావివరము :

సంవత్సరమునకు రు. 1-8-0

విడిసంచిక 0-2-0

1940వ సంవత్సరంలో ఆంధ్రభూమి మాస పత్రికలో ప్రచురించబడ్డ వ్యాసం ఇక్కడ చూడవచ్చు. ఇలాటి ఆణిముత్యాలు ఎన్నో ఎన్నెన్నో చదువరులకు అందుబాటులోకి తెచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ వారికి ప్రత్యేక కృతజ్ఞతలతో

విడివిడిగా ఉన్న ఈ ఆణిముత్యాలు ఒక పి.డిఎఫ్ గా మార్చి మరింతమందికి అందుబాటులోకి తీసుకుని రావటమే తప్ప కాపీరైటు హక్కుల ఉల్లంఘన ఉద్దేశం లేదనీ, లాభాపేక్ష / ధనార్జన ఉద్దేశమంతకన్నా లేదనీ సవినయంగా తెలియచేసుకుంటూ - ఈ వ్యాసం ఇక్కడ, ఇలా అభిమానులకు అందుబాటులో ఉంచటానికి అభ్యంతరాలు ఎవరికైనా ఉంటే తప్పక తెలియపర్చండి. క్షమాపణలతో వెంటనే తొలగిస్తాను.

భవదీయుడు

మాగంటి వంశీ మోహన్